
సౌరవిద్యుత్‌కు శ్రీకారం



సోలార్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన వడ్డిచర్ల 33/11 కెవి సబ్‌స్టేషన్



- త్వరలో సబ్‌స్టేషన్లలో సోలార్ యూనిట్లు
- పీఎం కుసుమ్ యోజన ద్వారా ఏర్పాటు
- జిల్లాలో 11 చోట్ల స్థలాలను గుర్తించిన అధికారులు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన విద్యుత్ శాఖ

లింగాలఘణపురం, మే 21: రోజు రోజుకూ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోతోంది. విద్యుత్ ఆధారిత అవసరాలు సైతం అదే స్థాయిలో ఉండడంతో విద్యుత్ ఉత్పాదకతపై ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిని సారించాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పీఎం కుసుమ్ (ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహా భియాన్)యోజన పేరుతో నూతన పథకాన్ని ప్రారంభించింది. దీని కింద సోలార్ విద్యుత్ (సౌరవిద్యుత్)యూనిట్ల ఏర్పాటుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వంతో అనుసంధానమై జిల్లాల్లో ఇప్పటికే కొనసాగుతున్న విద్యుత్ ఉపకేంద్రాల్లో(33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లు) అనుకూలంగా ఉన్న స్థలాలను గుర్తించిన విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు.

భౌగోళికంగా జిల్లా అనుకూలం..

దక్కన్ పీఠభూమిలోనే ఎత్తైన ప్రాంతమైన జనగామ జిల్లా సోలార్ యూనిట్ల ఏర్పాటుకు అత్యంత అనుకూలంగా ఉన్నట్లు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే గుర్తించాయి. వరంగల్ ఉమ్మడి జిల్లాలోనే సౌరవిద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణం, అధిక ఉష్ణోగ్రతల నమోదు, ప్లేన్ ఏరియా జనగామ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై అధికారులు చిత్తశుద్ధితో చొరవ చూపగలిగితే జిల్లాలో త్వరలో సోలార్ వెలుగులు విరజిమ్మే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

11 సబ్‌స్టేషన్లలో ఏర్పాటుకు ప్రతిపాదనలు..

జనగామ జిల్లాలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు అనుకూలమైన 11 సబ్‌స్టేషన్‌లను ఎన్‌పీడీసీఎల్ అధికారులు ఇప్పటికే ఎంపిక చేశారు. ఇందులో మొండ్రాయి సబ్‌స్టేషన్(చెరువుముందు తండా), బచ్చన్నపేట(ఆలింపూర్), చిలుపూర్ (పల్లగుట్ట), ఉప్పుగల్లు, వడ్డిచర్ల, పసరమడ్ల(పెద్దరాంచర్ల), పడమటి కేశ్వాపూర్(గంగాపూర్), సింగరాజుపల్లి (పెద్దమడూర్), నమిలిగొండ, అబ్దుల్‌నాగారం (గండిరామారం), కొడకండ్ల సబ్‌స్టేషన్లను ఎంపిక చేస్తూ కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎన్‌పీడీసీఎల్ అధికారులు అవసరమైన ప్రతిపాదనలను పంపారు.

ఒక్కో యూనిట్‌కు రూ. 4.25 కోట్లు..

పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా ముందుచూపుతో అదనంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే దిశగా అడుగులు వేస్తున్న కేంద్రప్రభుత్వం ఒక్కో సోలార్ యూనిట్ ఏర్పాటు కోసం రూ.4.25 కోట్లు కేటాయిస్తున్నది. ఈ లెక్కన జనగామ జిల్లాలోని 11 ప్రతిపాదిత సబ్‌స్టేషన్ల పరిధి యూనిట్లకు మొత్తంగా రూ. 46.75 కోట్లు పీఎం కుసుమ్ పథకం ద్వారా నిధులను మంజూరు చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ల నిర్వహణను ఆయా సబ్‌స్టేషన్ల పరిధి స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా సంఘాలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. క్షేత్రస్థాయిలో అన్ని పరిస్థితులు అనుకూలిస్తే కేంద్రం సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఆదేశాలు ఇస్తుంది. అయితే సోలార్ యూనిట్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుండటం గమనార్హం.

3.75 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంచనా..

జిల్లాలోని 11 సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్ల ద్వారా మొత్తం 3.75 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అధికారులు అంచనాలను రూపొందించారు. ప్రధానంగా మొండ్రాయి (చెరువుముందు తండా)ప్రతిపాదిత సోలార్ యూనిట్ ద్వారా 1 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి, అదేవిధంగా బచ్చన్నపేట(ఆలింపూర్) సబ్‌స్టేషన్ ప్రతిపాదిత సోలార్ యూనిట్‌లో 0.50 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తిని చేయనుండగా మిగతా 9 ప్రతిపాదిత యూనిట్లలో ఒక్కో యూనిట్ నుంచి 0.25 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించారు.

11 ప్రాంతాలను ప్రతిపాదించాం...

- వేణుమాధవ్- ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పీఎం కుసు మ్ యోజన కింద జిల్లాలో 11 సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించాం. క్షేత్ర స్థాయిలో అవసరమైన పూర్తి నివేదికను ప్రభుత్వా నికి అందజేశాం. ప్రభుత్వం నిధులను మంజూరు చేసి సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఆదేశిస్తే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.



వరదలను తట్టుకొనేలా..

బ్యారేజీకి ఎగువన కొనసాగుతున్న పనులు

'మేడిగడ్డ'లో తాత్కాలిక మరమ్మతు పనులు

- బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు
- పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్
- ఇప్పటికే 15వ నెంబర్ గేట్ ఎత్తివేత
- మిగిలిన గేట్ల ఎత్తివేతకూ చర్యలు
- ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగానే ప్రక్రియ

మహదేవపూర్ రూరల్, మే 21 : కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7 పిల్లర్లు వానాకాలం వరదను తట్టుకునేలా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఎగువన ఇప్పటికే ఉన్న షీట్‌ఫైల్స్‌ను తొలగించారు. ప్రాణహిత, గోదావరి నదుల నుంచి వచ్చే వరదను తట్టుకుని నిలబడేలా పిల్లర్ల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గేట్లను ఎత్తి.. నీరు దిగువకు వెళ్లేలా..

మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 85 గేట్లుండగా బ్లాక్-7లో 8గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరు 21న బ్యారేజీలోని బ్లాక్-7లో 20 నెంబరు పిల్లరు భారీ శబ్దాలు చేస్తూ కుంగుబాటుకు గురికాగ ఆపిల్లరుకు ఇరువైపులా ఉన్న పిల్లర్లు కూడా పాక్షికంగా కుంగాయి. అదే బ్లాకులో ఉన్న మిగతా పిల్లర్లకు కుంగుబాటు విస్తరించే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు బ్యారేజీలో అప్పటికే నిల్వ ఉన్న 10.10టీఎంసీల నీటిని బ్లాక్-7 గేట్లు మినహా మిగతా బ్లాకుల్లో గేట్లన్నీ ఎత్తి దిగువకు విడుదల చేశారు. అప్పటి నుండి బ్లాక్-7గేట్లన్నీ మూసే ఉండగా మిగతా గేట్లన్ని ఆపరేషన్‌లోనే ఉన్నాయి. దీనిపై ఎన్‌డీఎస్‌ఏ, ఇతర నిపుణుల బృందాలు పరిశీలన చేసినప్పటికి పునరుద్ధరణకు ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా వానాకాలం దగ్గరపడుతుండటంతో బ్లాక్-7లో గేట్లు వరదను తట్టుకునేలా ఎర్పాట్లు చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) మధ్యంతర నివేదికలో పేర్కొనడంతో అధికారులు ఆదిశగా కసరత్తు ప్రారంభించారు. ఈనెల 17న బ్లాక్-7లో 15వ గేట్‌ను ఎత్తిన అధికారులు మిగతా గేట్లను ఎత్తేందుకు ఎర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. గేట్లు ఎత్తితే మిగతా గేట్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రెండు బృందాలుగా అధికారులు పనులను చేపట్టినట్లు తెలిసింది. 16వ నెంబరు గేటుకు ఎగువన దిగువన టెక్నికల్‌గా అందిచాల్సిన సపోర్ట్‌ను సిద్ధం చేశాకే ఆగేటును, మిగతా గేట్లను ఎత్తనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈవానాకాలం వెళ్లేంత వరకు కేవలం వచ్చిన నీరు దిగువకు సాఫీగా వెళ్లేందుకు మాత్రమే ఏర్పాట్లు చేస్తున్నారు.

దిగువన షీట్‌ఫైల్స్.. పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్

బ్లాక్-7లో గేట్లు, పిల్లర్లు వరదను తట్టుకునేందుకు బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నారు. వరద తాకిడికి పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద నుంచి ఇసుక వెళ్లి బుంగ పడే అవకాశం ఉండటంతోనే బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు తప్పని సరైనట్లు అధికారులు భావిస్తున్నారు. పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద ఉండే ఇసుకు జారుకుంటూ వచ్చి షీట్‌ఫైల్‌ను తాకి అక్కడే

మిగతా 7వ పేజీలో..

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



పటేల్‌గూడెం పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం, మే21: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్‌లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా తాగునీటి వసతి, మరుగుదొడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట మండల నోడల్ అధికారి పడాల విష్ణుమూర్తితో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బాధ్యులు ఉన్నారు.

25న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ కల్చరల్, మే 21: జనగామ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది వెంకటనారాయణ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెన్, ఉమెన్ విభాగాల్లో అండర్-8, 10, 12, 14, 16, 18, 20 స్థాయిలో రన్నింగ్, లాంగ్ జంప్, జావలిన్ త్రో, షాట్‌పుట్, హామర్ త్రో, డిస్కస్ త్రోలో జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 6, 7 తేదీలలో హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 25వ తేదీ ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 98850 46437 నంబరులో సంప్రదించాలన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్

జనగామ కల్చరల్, మే 21: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్ రాజ్ అన్నారు. మాతాశిశు సంరక్షణ సేవలు పెంచడంలో భాగంగా మంగళవారం ఎంసీహెచ్‌లో సూపరింటెండెంట్‌తో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సిజేరియన్ల సంఖ్య తగ్గించాలని, సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎంసీహెచ్‌కు వచ్చిన గర్భిణులను వెనక్కు పంపకుండా వీలైనంత వరకు అడ్మిట్ చేసుకొని వైద్య సేవలు అందించాలన్నారు. అప్పుడే హాస్పిటల్‌పై నమ్మకం పెరుగుతుందన్నారు. సమావేశంలో డాక్టర్ మహేందర్, రవీందర్, భాస్కర్, అశోక్, కరుణాకర్, సుధీర్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

జిల్లావ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలను

సేవలను కొనియాడిన నాయకులు

వివరాలు 8లో..

పూటకో మాట చెబుతున్న కాంగ్రెస్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 21 (ఆంధ్రజ్యోతి): వడ్లకు బోనస్ విషయంలో కాంగ్రెస్ సర్కారు పూటకోసారి మాట మారుస్తోందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ సందర్భంగా హామీ ఇచ్చి తీరా గెలిచాక కేవలం సన్న వడ్లకు మాత్రమే ఇస్తామనడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో 20 నుంచి 30 శాతం మాత్రమే రైతులు సన్న వడ్లను పండిస్తారని, మిగతావారందరికీ అన్యాయం చేసినట్లేనని అన్నారు. బోనస్ విషయంలో వానాకా లం, యాసంగి అంటూ కాలయాపన చేసి తీరా సన్నవడ్లకే ఇస్తామని ప్రకటన చేయ డం ఏంటని ప్రశ్నించారు. రుణమాఫీ విషయంలో కూడా రైతులను రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేయబోతున్నారని పల్లా మండిపడ్డారు. రైతు కార్పొరేషన్ పేరుతో రుణమాఫీకి కావాల్సిన నిధులను అప్పుగా తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని, కానీ అది సాధ్యం కాదని అన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధికి మించి కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వబోదని అన్నారు. రైతులను మోసం చేసేందుకే కార్పొరేషన్ ప్రస్తావన తెచ్చారన్నారు. అంతేగాకుండా రేపోమాపో రైతుబంధుకు 3 లేదా 5 ఎకరాలు అం టూ కటాఫ్ పెట్టబోతున్నారని అన్నారు. ప్రాజెక్టులకు చిన్న చిన్న రిపేర్లు చేసి నీరందివ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ అని ఊదరగొట్టి ఇంతవరకూ ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభు త్వం ఇచ్చిన ఉద్యోగాలకే పట్టాలు ఇచ్చి తామే ఇచ్చినట్లుగా గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓడించాలని పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే మరో నయీమ్‌లా తయారవుతారని అన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, నాయకులు బాల్దె సిద్ధిలింగం, ఇర్రి రమణారెడ్డి, గద్దల నర్సింగరావు, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, తాళ్ల సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సర్కారు

బోనస్ పేరుతో మరో నాటకం

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్ రావు

తొర్రూరు, మే 21 : మోసపూరిత వాగ్దానాలతో అమలు కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బోనస్ పేరుతో రైతులను మరోసారి మోసం చేస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. తొర్రూరులోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రైతులు ఎన్నివడ్లు పండించినా 500ల బోనస్ ఇచ్చే బాధ్యత నాదే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, కాని నిన్న సన్న వడ్లు పండించిన వారికి మాత్రమే బోనస్ ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారని గుర్తుచేశారు. తెలంగాణలో 90 శాతం మంది రైతులు దొడ్డువడ్లు మాత్రమే సాగు చేస్తారని, కేవలం పది శాతం మంది రైతులు మాత్రమే సన్నవడ్లు పండిస్తారని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా బ్లాక్ మెయిల్ దందాలకు తెరలేపి డబ్బులు వసూలు చేసే తీన్మార్ మల్లన్నకు గ్రాడ్యుయేట్లు బుద్ధిచెప్పాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన మచ్చలేని నాయకుడు రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈనెల 23న తొర్రూరులో జరిగే నియోజకవర్గ పట్టభద్రుల సమావేశానికి మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎనుగుల రాకేష్‌రెడ్డి హాజరవుతారని, నియోజకవర్గంలోని పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, డాక్టర్ సోమేశ్వర్‌రావు, మెట్టు శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, భూపతి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆగ్రహం

- తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్
- తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని మండిపాటు
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం



చిలుపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతు రాజ్‌కుమార్

చిలుపూర్, మే 21 : తహసీల్దార్‌పై అన్నదాత ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు తెలియకుండా భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పురుగుమందు డబ్బాతో నిరసనకు దిగాడు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడం, పోలీసులు జోక్యం చేసుకోవడంతో దిగివచ్చిన తహసీల్దార్ చేసిన తప్పును సరిదిద్దేందుకు అంగీకరించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..

చిలుపూర్ మండలకేంద్రానికి చెందిన రైతు రాజ్‌కుమార్‌కు సర్వే నంబర్ 557 లో ఉన్న 1.24 ఎకరాల భూమిని గతంలో తన భార్య స్వప్న పేరిట పట్టా చేశాడు. ప్రస్తుతం దానిపై మల్కాపూర్ ఇండియన్ బ్యాంకులో క్రాప్‌లోన్ కూడా ఉంది. పాస్‌బుక్ సైతం తన వద్దే ఉంది. కాగా, ఇటీవల కుటుంబంతో సమస్యలు తలెత్తడంతో భార్య తన తల్లిగారింట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం ఆయనకు తెలియకుండా భార్య స్వప్న ఆ భూమిని హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం రాంపూర్‌కు చెందిన వ్యక్తికి విక్రయించడమే కాకుండా తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ కూడా చేయించింది. విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ పురుగుల మందు డబ్బాతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించాడు. పాస్‌బుక్ తనవద్ద ఉండగా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని, తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తనకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి న తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఎస్సై రాజేందర్ వచ్చి అతడితో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అప్పటివరకు కార్యాలయం లోపలే ఉన్న తహసీల్దార్ సరస్వతి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీస్తోందని గమనించి బయటకు వచ్చారు. రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతు శాంతించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత
- కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఘటనలు



జన్ను ఆదాం (ఫైల్)



జన్ను విజయ్ (ఫైల్)



జినుక గౌతమ్ (ఫైల్)

వివరాలు 6వ పేజీలో...

కేయూ ఇన్‌చార్జి వీసీగా వాకాటి కరుణ



- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గతంలో 'వరంగల్' కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం
- ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీ నియామకం లేనట్లేనా..?

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: కాకతీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పదవీ కాలం మంగళవారం ముగిసింది. దీంతో అదే రోజున ఇన్‌చార్జి వీసీగా కరుణను ప్రభుత్వం నియమించింది. కరుణ నియామకంపై అధ్యాపక, విద్యార్థి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడం, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పేరుండడంతో కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీస్తారనే నమ్మకం ఉందని చెబుతున్నారు.

సుపరిచుతురాలే..

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వాకాటి కరుణకు మంచి పేరుంది. కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో మంచి అడ్మినిస్ట్రేటర్‌గా అందరి మన్ననలు అందుకుంది. ఆమె నియామకం పట్ల వర్సిటీ వర్గాల్లోనూ సానుకూల అభిప్రాయలే వ్యక్తం అవుతున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడంతో తాజా మాజీ వీసీ రమేష్‌పై జరుగనున్న విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగే అవకాశం ఉన్నట్లు వారు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయనపై వచ్చిన అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని అధ్యాపక, విద్యార్థి వర్గాలు అభిప్రాయపడుతున్నారు.


పూర్తిస్థాయి వీసీ లేనట్లేనా...?

కేయూకు ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీని నియమించే అవకాశాలు లేనట్లు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కేయూకు మాత్రం ఏర్పాటు చేయలేదు. వీసీ పదవీ కాలం ముగింపునకు మూడు రోజుల ముందే విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడం, తీవ్రమైన ఆరోపణల మధ్య వీసీ పదవీ కాలం ముగియడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కేయూలో గందరగోళ పరిస్థితులు ఉండటంతో వర్సిటీ పాలన గాడిలో పడేంత వరకు ఐఏఎస్ అధికారిని వీసీ ఇన్‌చార్జిగా కొనసాగించి ఆందోళనలు సద్దుమణిగాక పూర్తి స్థాయిలో వీసీని నియమించే అవకాశాన్ని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.











ఎంజీఎంలో నిలిచిన విదుత్ సరఫరా




అంధకారంలో ఎంజీఎం ఆస్పత్రి ఆవరణ

వరంగల్ మెడికల్, మే 21: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం సుమారు ఆరు గంటలకుపైగా విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. సాయంత్రం 4.30 గంటలకు పోయిన కరెంటు.. రాత్రి 9.30 గంటల వరకు వచ్చింది. ఆస్పత్రిలోని జనరేటర్ల ద్వారా ఎమర్జెన్సీ వార్డులకు కరెంటు అందించారు. చాలావార్డుల్లో కరెంట్ లేకపోవడంతో రోగులు బయటకు వచ్చారు. వేసవి ఉక్కపోతకు ఇబ్బంది పడ్డారు. గతంలో కూడా ఇలాగే జరిగినా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదు. వచ్చే వర్షాకాలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే సాధారణ రూములతోపాటు ఎమర్జెన్సీ రోగుల ప్రాణాలకు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందని రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.









రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన అకుట్ సభ్యులు

కేయూలో వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర

చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్

వీసీ కీలక ఫైళ్లు మాయం చేస్తున్నారని అధ్యాపకుల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేశారు. మంగళవారం పరిపాలన భవనం ఎదుట వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. 'తాటికొండ అవినీతి అనకొండ' అనే ఫ్లెక్సీతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వీసీ రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపించారు. మంగళవారం వీసీ పదవీ కాలం ముగియడంతో కొన్ని ముఖ్యమైన ఫైళ్లు మాయం చేశారని విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేశారు. వీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వీసీ అక్రమాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా, కేయూలో వీసీ రమేష్ లాడ్జీ నుంచి కీలక ఫైళ్లు యామమైనట్లు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ యూనియన్(అకుట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు అయన అసోసియేషన్ సభ్యులతో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. వీసీ లాడ్జీ వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా వీసీ రమేష్ తన పాలనను లాడ్జీ నుంచే కొనసాగించారని, విజిలెన్స్ విచారణంలో అవసరమ్యే ఫైళ్లను ఫ్యాబ్రికేట్ చేయడానికి బయటకు తరలించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ కారులో వాటిని బయటకు తీసుకెళ్లడంపై తమకు అనుమానం ఉన్నదన్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలు, మార్కుల లిస్టులు, కంప్యూటర్ కొనుగోళ్లకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం ఉన్నట్లు వారు అనుమానాలు వ్యక్తం చేశారు. న్యాక్‌కు సంబంధించిన బిల్లులను సరిచేయడంతో పాటు ఇతరత్రా ఫైళ్లలో మార్పులు, చేర్పులు చేసేందుకు వీసీ ఫైళ్లను తరలించి ఉంటారని ఆరోపించారు.

కాగా, ఈ విషయమై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వీసీ రమేష్ తన వ్యక్తిగత పుస్తకాలు, జ్ఞాపికలు తదితర వస్తువులు తీసుకెళ్లి ఉంటారని సర్దిచెప్పడాన్ని వారు త్రీంగా ఖండించారు. ఒకానొక దశలో రిజిస్ట్రార్‌తో అకుట్ సభ్యులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వీసీ లాడ్జీ నుంచి ఫైళ్ల మాయం, సీసీ కెమెరాల ఫుటేజీ కోసం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లపై కేసు

వరంగల్ క్రైం, మే 21: ఈనెల 11న కె.రాజేష్ అనే వ్యాపారిపై జరిగిన దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లతోపాటు ఒక ప్రభుత్వ ఉద్యోగిపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 11న హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎం.డి.తాజొద్దిన్ పుట్టిన రోజు విందుకు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు కరుణాకర్ (బచ్చన్నపేట), రమేశ్ (రాయపర్తి)తో పాటు మహేందర్‌రెడ్డి (ప్రభుత్వ ఉద్యోగి), కె.రాజేష్ (వ్యాపారి) హాజరయ్యారు. విందులో తాజొద్దిన్‌తోపాటు మరో ముగ్గురు.. మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. కానిస్టేబుళ్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగి చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించిన రాజేష్.. వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన నలుగురు.. రాజేష్‌ను కారులో తీసుకువచ్చి కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబ్బాల జంక్షన్ వద్ద దాడి చేసి వదిలి వెళ్లారు. రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు.. తాజొద్దిన్, కరుణాకర్, రమేశ్‌తోపాటు మహేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు విషయాన్ని కేయూ పోలీసులు రహస్యంగా ఉంచారు.



బ్యారేజీకి దిగువన ఉన్న అప్రోచ్ రోడ్లు

వరదలను తట్టుకొనేలా..

(5వ పేజీ తరువాయి)

ఆగితే వరద ప్రభావం నివారించవచ్చనే షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా బ్యారేజీకి దిగువన ఉన్న కాంక్రీటు స్లాబ్‌ను కట్‌చేస్తూ పనులను ముమ్మరం చేస్తున్నారు. దీంతో పాటు పిల్లర్లు కుంగుబాటుకు గురైన తర్వాత బ్లాక్-7లో చేపట్టిన ఈఆర్‌టీ(ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్), జీపీఆర్(జియో ఫిజికల్ రాడార్) టెస్టుల ఆధారంగా గ్రౌంటింగ్ చేయనున్నట్లు తెలిసింది. ఫోమ్ గ్రౌంటింగ్‌తో పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల క్రింద ఉన్న బుంగలను పూడ్చాలని తొలుత నిర్ణయించినా.. ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో సాండ్ గ్రౌంటింగ్‌తోనే వాటి కింద ఉన్న బుంగలను పూడ్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సాండ్ గ్రౌంటింగ్ ప్రక్రియలో ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగా ర్యాఫ్ట్‌లకు హోల్స్ వేసి ఇసుక, స్యాండ్‌ను మిక్స్‌ను వేసి బుంగలను పూడిస్తే మళ్లీ వచ్చే వరదలకు సీపేజీ సమస్యను నివారించడంతోపాటు తాత్కాలికంగా ర్యాఫ్ట్, పిల్లర్లకు అదనపు శక్తి చేకూరుతుందనేది సాండ్ గ్రౌంటింగ్ ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు.

బ్యారేజీలో అప్రోచ్ రోడ్ల తొలగింపు

బ్లాక్-7లో గేట్ల ఎత్తివేత, స్యాండ్ గ్రౌంటింగ్, బ్యారేజీకి దిగువన షీట్ ఫైల్స్ ఎర్పాటు పూర్తవ్వగానే గోదావరి నదిలో బ్యారేజీకి ఎగువన, దిగువన ఉన్న అప్రోచ్ రోడ్లను సైతం తొలగించనున్నారు. బ్యారేజీ నిర్మాణ సమయంలో ఉన్న కాఫర్‌డ్యామ్‌కు సంబంధించి ఉన్న షీట్‌ఫైల్స్, కాంక్రీటు వ్యర్థాల తొలగింపు ప్రక్రియ గతంలోనే ప్రారంభమవగా.. అది చివరి దశకు చేరుకుంది.



సివిల్స్ అభ్యర్థులకు ఉపకార వేతనాలు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న స్వచ్ఛందసంస్థ

జఫర్‌గఢ్, మే 21: సివిల్స్ శిక్షణ పొందే అభ్యర్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొంగర ఎడ్యుకేషన్ హైద్రాబాద్ సంస్థ ప్రతినిధులు కొంగర గంగాధర్‌రావు, జెట్టి రవికుమార్ తెలిపారు. మంగళవారం వారు జఫర్‌గఢ్‌లో మాట్లాడుతూ.. సివిల్స్ పరీక్ష రాయాలనే అభ్యర్థులు.. శిక్షణ పొందేందుకుగాను తమ సంస్థ యేటా ఉపకార వేతనాలు అందిస్తోందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులని, ఈ పరీక్ష ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి వారికి సివిల్స్ శిక్షణ కోసం ఉపకార వేతనాలు అందజేస్తామని అన్నారు. అభ్యర్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జూన్ 23వ తేదీన వరంగల్‌లో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఎలాంటి రుసుము లేదన్నారు. పూర్తి వివరాలకు 9346777568 మొబైల్ నంబరులో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు సూచించారు.

గ్రీన్ చాంపియన్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ చాంపియన్ అవార్డుల కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈసెట్‌లో మెరిసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు


ఎం. నవ్యశ్రీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: ఈసెట్‌లో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎన్.దీక్షిత్ 3వ ర్యాంకు, పి.వివేక్ 4వ ర్యాంకు, బి.హేమశ్రీ 9 ర్యాంకు, పి.నాగసాయి 19వ ర్యాంకు సాధించారన్నారు. ఈసీఈలో ఎం. నవ్యశ్రీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, వి.వైష్ణవ్ 2, వి.అర్పిత 5, కె.హర్షిత్ 6, పి.హారిక 7, ఎం.డి. సొహైల్ 11, ఈఈఈలో టి.శ్రీవాత్సవ్ 2, ఎం.కౌశిక్ కుమార్ 4, మెకానికల్‌లో కె.చందు 2, బి.నిఖిల్ 10, ఓ.గౌతమ్ 12వ ర్యాంకు సాధించారన్నారు.

ఈ- సేవల మూగనోము!

- వారం రోజులుగా పని చేయని కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- లక్షల్లో నిలిచిపోయిన పన్ను చెల్లింపులు
- మరో ఐదు రోజుల పాటు ఇదే పరిస్థితి


హనుమకొండ అశోకా జంక్షన్ వద్ద మూసి ఉన్న ఈ-సేవా కేంద్రం

వరంగల్ కార్పొరేషన్, మే 21: గ్రేటర్ వరంగల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలు పన్నుల చెల్లింపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇంటి పన్నులు, యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించాలని నగర పాలక సంస్థ మైకులు పెట్టి మరీ ప్రచారం చేసింది. అయితే ప్రయోజనముంది.. పన్నులు వసూలు చేయాల్సి బల్దియా ఈ-సేవ కేంద్రాలు మూగ నోములు నోముతున్నాయి. వారం పాటు ఈ-సేవలు అందించక అక్కడి కంప్యూటర్ల స్ర్కీన్లు మసకబారిపోయాయి. అక్కడ పని చేసే సిబ్బంది ప్రజలకు చెప్పలేక కార్యాలయాలకు తాళం వేసి బయటకు వెళుతున్నారు. సాంకేతికలోపంతోపాటు నెట్‌వర్క్ సవరణ చేస్తుండడంతో ఈ ఇబ్బంది ఏర్పడినట్లు వినియోగదారులకు సిబ్బంది చెబుతున్నారు. నగర పాలకసంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తుండగా, ఒక్క సెంటర్‌లో కూడా సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ వెకెట్ ల్యాండ్ చార్జీలతో పాటు మరి కొన్ని యూజర్ చార్జీలు చెల్లించేందుకు వచ్చిన వినియోగదారులకు నిరాశే మిగులుతోంది. గడువు తేదీ దాటిపోయి అదనపు భారం పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్షల్లో నిలిచిపోయిన పన్నులు

ఈ- సేవా కేంద్రాల్లో సాంకేతిక లోపం ఏర్పడడంతో బల్దియా ఖజానాకు గండిపడింది. ప్రతీ రోజు వివిధ రూపాల్లో లక్షల్లో వసూలయ్యే డబ్బు ప్రజల వద్దనే ఉండిపోతోంది. ఇప్పటికే బల్దియా మలేరియా సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు జీతాల కొరత ఉన్నప్పటికీ వారం రోజులుగా కంప్యూటర్ విభాగంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు సిబ్బంది తమ తప్పు ఏమీలేదని, అంతా హైదరాబాద్‌లో వరంగల్ జీడబ్ల్యుఎంసీ సైట్ అప్‌డేట్ చేయడం వల్ల ఈ సమస్య ఎదురైందని చెప్పుకొస్తున్నారు. అంతే కాకుండా మరో ఐదు రోజుల పాటు ఇదే సమస్య ఉంటుందని కంప్యూటర్ నిపుణులు, సెంటర్ల ఉద్యోగులు పేర్కొంటున్నారు. పన్నుల చెల్లింపులు వేగవంతం కావాలంటే ఈ- సేవా కేంద్రాలు త్వరంగా పని చేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


నక్కలగుట్టలో పని చేయని ఈ-సేవా కేంద్రం

బల్దియా పరిధిలో ఈ- సేవా కేంద్రాలు

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. హనుమకొండ పరిధిలో కాజీపేట సర్కిల్ ఆఫీస్-2, సుబేదారి వాటర్ ట్యాంక్, నక్కలగుట్ట బల్దియా కార్యాలయం, మచిలీబజార్ కమ్యూనిటీ హాల్, అశోకా జంక్షన్ సర్కిల్, నయీంనగర్‌లో ఈ- సేవ సెంటర్లు పని చేస్తున్నాయి. అదే విధంగా వరంగల్ పరిధిలో బల్దియా ప్రధాన కార్యాలయం, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ సర్కిల్-1, హెడ్‌పోస్ట్ ఆఫీస్, శివనగర్, కరీమాబాద్‌లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ- సేవలు ప్రజలకు సేవలందిస్తాయి. ఇందులో ఒక్కో సెంటర్‌లో ఇద్దరి నుంచి ముగ్గురు పనిచేస్తారు. ఈ కేంద్రాలను వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట డిప్యూటీ కమిషనర్‌లు పర్యవేక్షిస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉంది..

అనిసుర్ రషీద్, బల్దియా అదనపు కమిషనర్

ఏప్రిల్ చివరి వరకు ఇంటి పన్నులో వడ్డీలో 5శాతం రాయితీ ఇచ్చాం. కొందరు చెక్కులు సమర్పించి రశీదులు పొందారు. కానీ కొన్ని చెక్కులు బ్యాంకులో చెల్లుబాటుకాక పోవడం, బల్దియాకు డబ్బులు చెల్లించినట్లు రశీదులు కలిగి ఉండడంతో ఈ సమస్య ఎదురైంది. ఈ సమస్యలు హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ చూస్తుంది. ఒకటి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కారం జరిగి ప్రజలకు సేవలు అందిస్తారు.

భద్రకాళి సన్నిధిలో పుల్లెల గోపీచంద్


భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న పుల్లెల గోపీచంద్ దంపతులు

వరంగల్ కల్చరల్, మే 21: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పద్మశ్రీ పుల్లెల గోపీచంద్ దంపతులు మంగళవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితోపాటు క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వీరి చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది..

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత

కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఘటనలు


జన్ను ఆదాం, జన్ను విజయ్ మృతదేహాలు

వరంగల్‌సిటీ/ బయ్యారం, మే 21: ఎండలవేళ ఈత సరదా ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఓ బాలుడు సహా ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటనలను ఆయా కుటుంబల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలివీ.. వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన జన్ను విజయ్ అలియాస్ ఏసు(38), జన్ను ఆదాం(34) ఇద్దరూ పెయింటర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇరుగుపొరున ఉండే ఈ ఇద్దరు రోజూ లాగే మంగళవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చారు. అప్పటికే ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో జన్ను విజయ్, తన కుమారుడు జన్ను వివేక్, జన్ను ఆదాం తన కుమారుడు జన్ను ఆదిత్య, స్థానికంగా ఉండే మరోవ్యక్తి జన్ను రాహుల్ కలి టసి ఈత కొట్టేందుకని గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని ముసలమ్మకుంట వద్దకు చేరుకున్నారు. తమ పిల్లలను గట్టున ఉంచి.. విజయ్, ఆదాం నీటిలోకి దిగారు. వారు ఈత కొడుతూ ఆ కుంటలో ఉన్న బురదగుంతలో చిక్కుకుని ఎంతకీ పైకి రాలేదు. గట్టుపైనున్న వారి పిల్లలు గమనించి కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఇందిరమ్మ కాలనీ, దేశాయిపేటకు చెందిన వారు అక్కడికి చేరుకుని గాలించి.. వారిని బయటికి తీయగా అప్పటికే విజయ్, ఆదాం మృతిచెందారు. అప్పటికే ఈ సమాచారం అందుకున్న ఏనుమాముల ఎస్‌ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జన్ను ఆదాం భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదాంకు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉండగా, విజయ్‌కి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరి మృతదేహాలను పోలీసులు ఎంజీఎం మార్చురీకి తరలించామని, ఎస్‌ఐ శ్రీకాంత్ కేసును దర్యాప్తు చేస్తున్నారని సీఐ పులి రమేష్ తెలిపారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి బాలుడు..


గౌతమ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని దామెరచెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ ఎనిమిదో తరగతి విద్యార్థి మృత్యువాత పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన జినుక లక్ష్మీనారాయణ, రేణుక దంపతుల కుమారుడు గౌతమ్ (14) మహబూబాబాద్‌లోని సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చిన గౌతమ్ ఈత నేర్చుకునేందుకని తన చిన్నమ్మ కుమారుడు గోపాలదాసు గణేష్‌తో కలిసి తమ ఇంటి సమీపంలోని దామరచెరువుకు వెళ్లాడు. అయితే అతడు తాను దిగిన ప్రాంతంలో లోతుగా ఉందన్న విషయాన్ని గమనించని గౌతమ్ నీటిలో మునిగి మృతి చెందాడు. అతడికి తోడుగా వెళ్లిన గణేష్ పరుగున ఇంటి వచ్చి కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో వారు స్థానికుల సాయంతో చెరువులో వెతికి.. గౌతమ్‌ను బయటకు తీసి బయ్యారం పీహెచ్‌సీకి తరలించారు. కానీ గౌతమ్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. గౌతమ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జినుక లక్ష్మీనారాయణకు కుమారుడు గౌతమ్, కుమార్తె ఉండగా.. కుమారుడి మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలి..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న ఎర్రబెల్లి

రాంనగర్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న యూట్యూబ్ చానెల్ పెట్టి దందాలు చేసే చీటరని విమర్శించారు. ఆయనకు అవకాశం ఇస్తే ప్రమాదమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంతర్‌రెడ్డి మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని ఆయన ఆరోపించారు. తీన్మార్ మల్లన్న, రేవంత్‌రెడ్డిలు ఇద్దరు ఇద్దరేనని, ఇద్దరు మోసగాల్లేనని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటికూడా నెరవేర్చలేదన్నారు. చిన్నచిన్న కారణాలు చూపి కాళేశ్వరానికి నీరు రాకుండా చేశారని, కరెంటు, సాగునీరు అందించలేదన్నారు. ఆరోగ్యశ్రీ అతిగతీ లేదని, కల్యాణలక్ష్మీ పథకాన్ని బుట్టదాఖలు చేశారని, నిరుద్యోగ భృతి అందించలేదన్నారు. ఎన్నికల ముందు ఓ మాట.. ఎన్నికల తర్వాత ఓ మాట రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల పక్షాన శాసనమండలిలో గళమెత్తుతాడని దయాకర్‌రావు తెలిపారు.

మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలరని, బీజేపీ అభ్యర్థి అసమర్థుడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విద్యావంతుడు, ప్రజలకు సేవచేయాలనే తపన కలిగిన సమర్థుడని ఆయన తెలిపారు. పెద్దల సభ రైటర్స్‌కు వేదిక కావాలని, చీటర్స్‌కు వేదిక కాకూడదన్నారు. చీటరైన తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తికి అవకాశం కల్పిస్తే ప్రమాదమన్నారు. అధికార పార్టీని ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రసమయి బాలకిషన్, సతీష్ బాబు, నేతలు సంజయ్, రవిందర్‌సింగ్, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న బీఆర్‌ఎస్ పార్టీ

మాజీ మంత్రి ఈటల రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, మే 21: ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన బీఆర్‌ఎస్ పార్టీ.. ఇప్పుడు ఆదరణ లేక వెలవెలపోతున్నదని మాజీ మంత్రి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రుల మాటకే దిక్కులేదని, ప్రజలు వచ్చి సమస్యలు చెప్పుకున్నా పరిష్కరించే అధికారం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం రూ.7,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీకి ఓటేస్తే బాధితుల తరపున ప్రశ్నించలేరని పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. 2021 నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు రావల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో వారు నరకయాతన అనుభవిస్తున్నారని ఈటల అన్నారు.

కుల, మత భేదం లేకుండా దేశ సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని పట్టభద్రులు బలపర్చాలని కోరారు. స్వచ్ఛభారత్ పేరుతో దేశంలో మారుమూల గ్రామాల్లో మరుగుదొడ్లను నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి మోదీ అని పేర్కొన్నారు. అమెరికా వంటి అగ్రరాజ్యంలో డిజిటల్ ట్రాన్సాక్షన్ అమలు కావడానికి పదేళ్ల పట్టిందని, కానీ మోదీ చొరవతో భారత్ మూడేళ్లలోనే అమలులోకి వచ్చిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు సమస్యలను పరిష్కరించేందుకు మోదీని ఆశ్రయిస్తున్నాయన్నారు. అలాంటి కీర్తిని భారత్‌కు తీసుకొచ్చిన మోదీని ప్రజలు ఆదరించాలన్నారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్‌గాంధీ వరకు 'గరీబ్ హఠావో' అనే ఒకే నినాదంతో వస్తోంది తప్ప.. పేదరికాన్ని నిర్మూలించింది లేదని విమర్శించారు. ప్రేమేందర్‌రెడ్డి 40 ఏళ్ల అనుభవం, విద్యాభ్యాసం పట్టభద్రుల పక్షాన ప్రశ్నించేందుకు దోహదం చేస్తుందని ఈటల పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వాగ్దేవి కళాశాలల అధినేత దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ టెండర్లలో అవకతవకలు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రాంనగర్, మే 21: పౌర సరఫరాలశాఖ పరిధిలో జరుగుతున్న టెండర్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని, అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం బియ్యం సరఫరా, ధాన్యం టెండర్లు అర్హత లేని కేంద్రియ బండార్ లాంటి సంస్థలకు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై మూడురోజులుగా తాము ఆరోపణలు చేస్తున్నప్పటికీ మంత్రులు స్పందించడం లేదన్నారు. ఈ విషయంలో భారీగా డబ్బులు చేతులు మారాయని ఆయన విమర్శించారు. ఎవరికి ముట్టేవి వారికి ముట్టాయి కాబట్టే.. ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదని ఆయన దుయ్యపట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కేంద్రియ బండార్ సంస్థకు టెండర్లు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అవకతవకల విషయమై ఈనెల 23న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సివిల్ సప్లయి కమిషనర్‌కు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు రవీందర్‌సింగ్, జోరిక రమేశ్, వీరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వర్క్‌షాపులో బల్దియా కమిషనర్

లేక్ ప్రొటెక్షన్‌పై అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 21: హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మంగళవారం రాష్ట్ర మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి సీడీఎంఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర పాలక సంస్థ నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు బల్దియా ఎస్‌ఈ ప్రవీన్‌చంద్ర పాల్గొన్నారు. 'లేక్ ప్రొటెక్షన్ అండ్ రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీటి వనరులు కాపడడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని, ఒక రోజు వర్క్‌షాపు ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నామన్నారు. సీడీఎంఏ గైడ్‌లైన్స్ ప్రకారం పనులు నిర్వహిస్తే సహజ వనరులు రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, సీడీఎంఏ దివ్య దేవరాజన్, వరంగల్ ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మరో ముగ్గురికి గాయాలు


విజయ్ (ఫైల్)

కాజీపేట, మే 21: జిమ్ సెంటర్ బోర్డు సరిచేస్తుండగా విద్యుత్ తీగలు తాకి ఒకరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట నిట్ సమీపంలో పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న బ్లూఫిట్‌నెట్ జిమ్ సెంటర్ ఐరన్ ఫ్లెక్సీ బోర్డు ఇటీవల గాలివానకు ఊడిపోయింది. బోర్డును సరిచేసేందుకు జిమ్‌సెంటర్‌లో పనిచేసే దర్గా కాజీపేటకు చెందిన విజయ్(28) ప్రయత్నించగా కుదరలేదు. దీంతో జిమ్‌లో శిక్షణ కోసం వచ్చిన రాము, విష్ణు, సందీప్, విజయ్ కలిసి బోర్డును తీసేందుకు ప్రయత్నించగా ప్రక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు విజయ్‌కి తాకాయి. ఈ ఘటనతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో శిక్షణకు వచ్చిన రాము, విష్ణు, సందీప్‌లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, విజయ్ ఎంబీఏ పూర్తి చేసి జిమ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇతడు అవివాహితుడు.

'టెన్నిస్'పై క్రేజ్

నగరంలో విస్తరిస్తున్న క్రీడ

ఆసక్తి కనబరుస్తున్న యువత


లాన్ టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, మే 21: సంపన్నుల క్రీడగా పేరుగాంచిన లాన్ టెన్నిస్ క్రీడ నగరంలో రోజు రోజుకూ విస్తరిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్‌కు పరిమితమైన లాన్ టెన్నిస్ క్రీడపై నగరంలోని యువత ఆసక్తి కనబర్చుతున్నారు. క్రేజీ గేమ్‌గా పిలువబడే ఈ ఆటలో శిక్షణ పొందాలంటే సామాన్యులకు ఆర్థికంగా భారంగా ఉండేది. వేల రూపాయలతో రాకెట్‌లు కొనలేక సామాన్య యువకులు ఈ క్రీడపట్ల సుముఖత చూపించకపోయేవారు. ఇప్పుడు ఈ టెన్నిస్ క్రీడపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. అతి తక్కువమంది ఆడే లాన్ టెన్నిస్ క్రీడ.. ఇప్పుడు నగరంలో అత్యాధునిక హంగులు, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన కోర్టులు అందుబాటులోకి రావడంతో చాలామంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలలో పలు ప్రయివేటు పాఠశాలతో పాటు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియం సమీపంలో అత్యాధునిక హంగులతో కూడిన (సింథటిక్) టెన్నిస్ కోర్టు, అదే విధంగా సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లోని టెన్నిస్ కోర్టుల్లో రోజూ వందల మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. డీఎస్‌ఏ ఆధ్వర్యంలో మే1 నుంచి ఏర్పాటు చేసిన లాన్ టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో నగరంలోని యువత పెద్దఎత్తున ఉత్సాహం కనబర్చుతున్నారు.

అధునాతన కోర్టులు

హనుమకొండ జేఎన్‌ఎస్‌లో రెండు సింథటిక్ కోర్టులు, సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రెండు కోర్టులు, హనుమకొండ నిట్‌లో రెండు కోర్టులు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు కోర్టులు ఏర్పాటు చేయడంతో నిత్యం వందల మంది క్రీడాకారులతో టెన్నిస్ కోర్టులు కళకళలాడుతున్నాయి. అదే విధంగా నగరంలోని వివిధ ప్రయివేటు పాఠశాలలో సైతం లాన్ టెన్నిస్ క్రీడ విస్తరిస్తోంది. స్కిల్ స్ట్రోక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో టెన్నిస్ కోర్టులు అందుబాటులో ఉండటం ద్వారా రోజు రోజుకూ ఈ క్రీడకు ఆదరణ పెరుగుతోంది.

చిన్నారులు, యువత ఆసక్తి చూపుతున్నారు

ఎ.నర్సయ్య, వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు

అత్యాధునిక టెన్నిస్ కోర్టులు జిల్లాతోపాటు నగరంలో అందుబాటులో ఉండటంతో చిన్నారులు, యువత ఈ క్రీడపై ఆసక్తి కనబర్చడంతో ఆదరణ పెరుగుతోంది. డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు యువత పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయం. జిల్లా వ్యాప్తంగా టెన్నిస్ క్రీడ మరింత విస్తరించేందుకు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తోంది.

టెన్నిస్ అంటే ఇష్టం

ధరణి, క్రీడాకారిణి

ఇతర క్రీడల కంటే టెన్నిస్ క్రీడ అంటే చాలా ఇష్టం. టెన్నిస్ క్రీడలో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకరావడమే నా లక్ష్యం. వేసవి సెలవుల్లో జేఎన్‌ఎస్ టెన్నిస్ కోర్టులో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నా.. జిల్లా, రాష్ట్ర, జాతీయ టెన్నిస్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించాలనే సంకల్పంతో సాధన చేస్తున్నా..

రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించాలి

జిల్లా అధికారులకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఆదేశాలు



తొర్రూరులో వడ్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ గోపి, కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, మే 21: క్షేత్ర స్థాయిలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారి బి.గోపి సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జనగామ మండలం గానుగుపహాడ్ రైతు వేదికలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పరిశీలించాలన్నారు. విడి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదన్నారు. అదే విధంగా ప్యాక్ చేసిన విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు విత్తనాలు, ఎరువులపై షార్ట్ ఫిల్మ్ ద్వారా, పల్లెల్లో రైతు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. రైతు వేదికల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకింగ్ కవర్‌తో పాటు రసీదును రైతులు భద్రపరచుకోవాలన్నారు. డీలర్లు తప్పనిసరిగా రైతుల వారీగా మూడు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో ప్రతి రోజూ ఎంఏవోలు, ఏఈవోలు విత్తనాలు, ఎరువుల డీలర్ కేంద్రాలను సందర్శించి అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని క్షుణ్ణంగా రిజిసర్లు తనిఖీ చేయాలని, రోజూ వారీ నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ కూడా ఎరువుల కొరత లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌డీవో వెంకన్న, అధికారులు వినోద్‌కుమార్, రోజారాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గింజ లేకుండా కొనాలి..

పాలకుర్తి: కొనుగోలు కేంద్రాల్లో ఒక్క గింజ లేకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశించారు. మంగళవారం పాలకుర్తి మీదుగా మహబూబాబాద్‌కు వెళుతున్న ఆయన తొర్రూరు గ్రామంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎన్ని టన్నులు కొనుగోలు చేశారు.. రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయా అని ప్రశ్నించారు. 210 మంది రైతుల వద్ద 9 వేల 163 క్వింటాళ్ల ధాన్యాం కొనుగోలు చేయగా ఇందులో 187 మంది రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని పీఏసీఎస్ సిబ్బంది వివరించారు. ఆయన వెంట డీఏవో వినోద్‌కుమార్, ఆర్డీవో డిఎస్. వెంకన్న, తహసీల్దార్ వెంకటేశం ఏఈవో సంధ్య, రైతులు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవీన వ్యవసాయంపై అవగాహన

కొడకండ్ల: మండలకేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు నవీన వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రఘురాంరెడ్డి, సతీష్‌చంద్ర, ఉమారెడ్డిలు వీడియో ద్వారా రైతులకు సేంద్రీయ వ్యవసాయం గురించి, వరి వత్తనాలలో వర్షాకాలంలో వాడుకోదగ్గ నూతన వంగడాలైన డబ్ల్యూజీఎల్ 1119, డబ్ల్యూజీఎల్ 1487లు వేసిన రైతుల అనుభవాలను చూపిస్తూ స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. విత్తన మేళా ఉపయోగం, వరికొయ్యలు కాల్చడం వల్ల ఏర్పడే పర్యావరణ నష్టం గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పరుశురామ్, ఏఈవోలు ప్రియాంక, సువర్ణ, వెంకటేష్, శ్రీవాణి, సరిత కుమారి, కీర్తి, మహేశ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కొడకండ్ల మే 21 : మండలంలోని మైదం చెరువు తండాలో మంగళవారం స్థానికులు నిర్వహించిన దుర్గమ్మ పండుగలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దయతో చిన్నా పెద్దా, పాడిపంట, పశువులు క్షేమంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



జనగామలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రఘునాథపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పాలకుర్తిలో కార్యకర్తలతో కలిసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

జిల్లావ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

సేవలను కొనియాడిన నాయకులు

జనగామ కల్చరల్, మే 21: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనగామ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, బడికె ఇందిర, బనుక శివరాజు యాదవ్, వంగాల కళ్యాణి, జక్కుల అనిత తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళి అర్పించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన గొప్ప నాయకుడు అని కీర్తించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, భూమ రంగయ్య, చిలువేరు కృష్ణమూర్తి, హరీష్, కర్ణాకర్, బండపల్లి వెంకన్న, సలీం, మణెమ్మ, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు టి.రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ దేశంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి పాటుపడిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. దేశ ప్రధానిగా అనేక సంస్కరణలు అమలు చేశారన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీ కార్యకర్త పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిప్పరబోయిన కృష్ణ, కుక్కల ఎల్లయ్య, సముద్రాల రాజు, కొమురయ్య, బాలయ్య, మల్లయ్య, నర్సయ్య, ఎల్లస్వామి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: దేవరుప్పుల కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పూలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, గణేష్, యాకస్వామి, అనిల్, ఆర్. రమేష్, వెంకన్న, పాండు కృష్ణ, రవీందర్, సత్తయ్య, గంగరాజు, పుల్లయ్య, వెంకన్న, రాంచంద్రునాయక్, కుమార్, నరేందర్, పాండు, సుధాకర్, అశోక్, నిఖిల్, మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొడకండ్ల: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలో ఆయన కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు డి.సురేష్‌నాయక్, సోమనర్సయ్య, కుందూరు అమరేందర్‌రెడ్డి, పసునూరి మధుసూదన్, దూలం సతీష్, వలబోజు రమేశ్, ధర్మారం భిక్షపతి, నేతా కృష్ణ, మసురం రవీందర్, మనోహర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోళ్ల రవిగౌడ్, బొనాసి క్రాంతి కుమార్, గాదె మహేందర్ రెడ్డి, కడారి రవి, కొంరెల్లి, కడారి చిననాగేష్, పోరెడ్డి లక్ష్మి, పేర్నె ఉషరవి పాల్గొన్నారు.

నర్మెట: రాజీవ్‌గాంధీ వర్ధంతిని నర్మెట మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజబోయిన లక్ష్మీనారాయణ, చెవుల పరుశరాములు, కూకట్ల చంద్రమౌళి, భూపతిరెడ్డి, వలబోజు శ్రీనివాస్, భైరగోని అంజయ్య, భాగ్యలక్ష్మి, గొట్టె రాజశేఖర్, పల్లె ప్రభుదాసు, మహేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, సుంకె రవిశంకర్



లింగాలఘణపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

లింగాలఘణపురం/రఘునాథపల్లి, మే21: ఈనెల 27న జరగనున్న వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం లింగాలఘణపురంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ తరపున బ్లాక్‌మెయిలర్ పోటీచేస్తుండగా బీఆర్ఎస్ పక్షాన విద్యావంతుడు రాకేశ్‌రెడ్డి బరిలో ఉన్నారని, బ్లాక్‌మెయిలర్‌కు బుద్ధి చెప్పేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్, నాయకులు ఊడ్గుల భాగ్యలక్ష్మి, చౌదరిపల్లి శేఖర్, దుంబాల భాస్కర్‌రెడ్డి, గట్టగల్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా రఘునాథపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వారాల రమేష్, గూడ కిరణ్ కుమార్, శాగ నాగరాజు, కొడిదేటి శంకర్, మడ్లపల్లి సునీత, తిప్పారపు రమ్య, దొనికెల రమాదేవి, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించుకోవాలని రాజన్న సిరిసిల్లా పార్టీ జిల్లా అధ్యక్షులు, జనగామ అసెంబ్లీ ఇన్‌చార్జి తోట ఆగయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఉన్నత విద్యావంతుడైనందున పట్టభద్రుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉంటాడన్నారు. సమావేశంలో ఇర్రి రమణారెడ్డి, పులిగిళ్ల పూర్ణచందర్, గంగం సతీష్‌రెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, కల్లూరి అనిల్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వేముల లక్ష్మణ్‌గౌడ్, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, ఎండీ షబ్బీర్, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, ఆజాం, భానుచందర్, కర్నాల వేణు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికే ఓటేయాలి

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



జనగామలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

జనగామ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. బీజేపీ కోసం 40 ఏళ్లుగా క్రమశిక్షణతో ప్రేమేందర్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా పార్టీని విడిచి పోలేదని కొయాడారు. ఇతర పార్టీల ప్రలోభాలకు లాలూచీ పడకుండా బీజేపీ కోసం కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ఎలాంటి మచ్చ లేని గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని పట్టభద్రులు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర పార్టీల అభ్యర్థుల గుణగణాలు, వ్యక్తిత్వం గురించి పట్టభద్రులకు బాగా తెలుసనని అన్నారు. అలాంటి వారి విషయంలో ఆలోచన చేసి ఓటు వేయాలని కోరారు. వచ్చే 6 రోజుల పాటు పార్టీ కార్యకర్తలంతా ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల జనగామ ఇన్‌చార్జి భరత్‌గౌడ్, నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేష్, శివరాజ్‌యాదవ్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఆదరించాలి

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్

నర్మెట/బచ్చన్నపేట, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ సోమవారం మచ్చుపహాడ్ గ్రామంలో ప్రచారం చేశారు. ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో గొల్లపల్లి కుమారస్వామి, జడల రమేష్, గొల్లపల్లి అంజయ్య, బాలచందర్‌గౌడ్, బుర్ర రాజు, ప్రమోద్, చంద్రయ్య, నాగపూరి బాలరాజు, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా బచ్చన్నపేట మండలం కొడవటూరు, కట్కూరుతో పాటు పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిస్తేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్యక్రమాల్లో మల్లం శ్రీనివాస్, పుట్ట నర్సింహులు, పాకాల చిరంజీవి, బుచ్చిరెడ్డి, కార్తీక్, యాదగిరిరెడ్డి, శశి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ కల్చరల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో చెంచారపు బుచ్చిరెడ్డి, బడికె ఇందిర, వంగాల కళ్యాణి మల్లారెడ్డి, జక్కుల అనిత వేణుమాధవ్, జనార్దన్, సంజీవరెడ్డి, మచ్చ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మచ్చుపహాడ్‌లో ప్రచారం చేస్తున్న నాగపూరి కిరణ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ బరిలో నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల దేవేందర్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ కేంద్రంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతనే బీసీలకు సముచిత గౌరవం దక్కుతోందన్నారు. సమాజంలో అధికశాతం ఉన్న బీసీలు ఐక్యంగా ముందుకు వెళ్లినప్పుడే మనకు అవకాశాలు వస్తాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తీన్మార్ మల్లన్నను గెలిపించుకొని బీసీల సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

రఘునాథపల్లి, మే 21: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జనగామ ఆర్డీవో డి.కొంరయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో చేయాల్సిన అవశ్యకత గురించి అధికారులకు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ పి.యుగేందర్, ఆర్ఐ బల్‌రాం ఉన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణంలో రాజుకుంటున్న వివాదం

రెండుగా చీలిన అధికార, ప్రతిపక్ష నేతలు



తీర్మానం చేసిన ప్రదేశంలో వెలిసిన డబ్బాలు

బచ్చన్నపేట, మే 21: బచ్చన్నపేటలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలో వివాదం రాజుకుంటోంది. ఆలేరు ప్రధాన రహదారి వెంట ఉన్న స్థానిక హైస్కూల్ ప్రహరీని ఆనుకుని మూలకు సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని అఖిలపక్షం పేరుతో పలు పార్టీల నాయకులు తీర్మానం చేసి పనులు ప్రారంభించారు. దీన్ని స్థానికులతో పాటు, కొందరు విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. ప్రతీ ఆదివారం సంతకు వచ్చే వారు టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దగ్గరలో నిర్మిస్తే ఇబ్బందులుండవని కొందరు వాదిస్తుండగా, జన సంచారం ఉండే ప్రదేశంలో నిర్మించడం సబబు కాదంటూ మరికొందరు వాదనకు దిగుతున్నారు. కాగా ఇటీవల అదే స్థలంలో రెండు డబ్బాలు వెలిశాయి. దీంతో ఆస్థలంలో డబ్బాలు వేసుకునేందుకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారంటూ పలువురు జీపీ అధికారులపై మండిపడుతున్నారు. స్థానిక ఎంపీటీసీ నల్లగోని పుష్ప బాలకిషన్‌గౌడ్ మంగళవారం జీపీ అధికారులను కలిసి ఎస్సీ హాస్టల్ పక్కన ఉన్న బంజరు దొడ్డి ప్రదేశంలో నిర్మించాలంటూ వినతిపత్రం అందించారు. కాగా ఎన్నికల సమయం కావటంతో అధికార, ప్రతిపక్ష నేతలు రెండుగా చీలిపోయి ప్రతిష్టకు పోతుండటంతో అసలు విషయం పక్కకు పోయి, నేతల మధ్య వార్ నడుస్తోంది. చివరికి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రఘునాథపల్లి, మే 20: నిడిగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆచార్యులు కృష్ణమాచార్య స్వామి, వీరరాఘవచార్య స్వామి, శ్రీనివాసచార్య స్వామి, తోయప్పన్ ఆచార్యస్వామి, అనంత్‌స్వామి, గోవిందంస్వామి, ఆలయ నిర్వాహకులు పద్మనర్సింహరెడ్డి, గోపాల్ రెడ్డి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో బోర్‌వెల్ పనులు ప్రారంభం

చిలుపూర్, మే 21: మండలంలోని శ్రీపతిపల్లి హనుమాన్ దేవాలయంలో భక్తుల తాగునీటి సౌకర్యార్థం గ్రామానికి చెందిన మాలోత్ రాజునాయక్ రూ1.50 లక్షలు వెచ్చించి స్వచ్ఛందంగా బోర్‌వెల్ వేయించారు. మరో రూ.2లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాజునాయక్‌ను పలువురు అభినందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు పోలబోయిన నరేష్, పిట్టల బాలకృష్ణ, మోతె మహేశ్ తదితరులు ఉన్నారు.

వాటర్‌ప్లాంటు పునరుద్ధరణ

చిలుపూర్, మే 21: మండలంలోని కృష్ణాజీగూడెంలో కొద్ది నెలలుగా మూసి ఉన్న మినరల్ వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్ళు క్రమం తప్పకుండా సరఫరా చేస్తున్నామని, గ్రామస్థుల కోరిక మేరకు మినరల్ వాటర్ ప్లాంటును సైతం నడిపిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రఘునాథపల్లి, మే 21: మండేలగూడెం వాగుతో పాటు ఎల్లారెడ్డిగూడెం కానుగుల వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఆ రెండు గ్రామాలకు చెందిన నిందితులు చింతకాయల నరేష్, పర్వత సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.నరేష్ వివరించారు.

ఎంసెట్ ర్యాంకర్ మణితేజకు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 21: ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించిన శివునిపల్లి పట్టణానికి చెందిన కొంతం మణితేజను మంగళవారం స్వచ్ఛంద సంస్థలకు చెందిన పలువురు అభినందించారు. స్టేషన్‌ఘన్‌పూర్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం, వికాస తరంగిణి బాధ్యులు మణితేజతో పాటు తండ్రి వేణుగోపాల్‌ను శాలువాలతో సత్కరించారు. మణితేజ కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.అంజయ్య, పెసరు సారయ్య, వై.ప్రభాకర్, యు.మల్లేశం, కొంతం శ్రీనివాస్, ఎం.కిషోర్, గోలి రాజశేఖర్, దారం రాజు, ఐత కృష్ణమోహన్, ఎమ్డీ రజాక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మణితేజను సత్కరించారు. కార్యక్రమంలో శివునిపల్లి మాజీ సర్పంచ్ బూర్ల విష్ణు, పార్టీ నాయకులు కొలనుపాక శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు: ఏసీపీ

పాలకుర్తి, మే 21: ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య హెచ్చరించారు. మంగళవారం పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల ఎరువుల దుకాణాల యాజమానులతో పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ ముంచుకొస్తున్నందున రైతులు తొందరపడి ఏది పడవద్దని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మేలైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్, శ్రావన్‌కుమార్, చెన్నకేశవులు, వ్యాపారులు పాల్గొన్నారు.



ఎరువుల వ్యాపారులతో మాట్లాడుతున్న ఏసీపీ నర్సయ్య

అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎమ్డీ అబ్బాస్

స్టేషన్‌ఘన్‌పూర్, మే 21: సన్నాలు, దొడ్డు రకం అనే తేడా లేకుండా అన్ని వడ్లకు రాష్ట ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎమ్డీ అబ్బాస్ డిమాండ్ చేశారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆయన మీడియా మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గం సన్నాలకు బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం సరికాదన్నారు. దానివల్ల మిగితా రైతులు నష్టపోతారని అన్నారు. రుణమాఫీని ఆగస్టులో కాకుండా జూన్ మొదటివారంలో అమలు చేయాలని కోరారు. జూన్‌లో మాఫీ చేస్తే రైతులు బ్యాంకులలో మళ్ల రుణాలు తీసుకొని పెట్టుబడికి ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. వానకాలం పంటల సాగు ప్రారంభం అవుతున్నందున విత్తనాలు, ఎరువులు, దేవాదుల పథకం ద్వారా సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా ప్రకటించి, లెదర్ పార్కును వినియోగింలోకి తీసుకురావాలని కోరారు. బీజేపీ అనేక విధాలుగా ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడ్డప్పటికీ ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావు ఇస్తోందన్నారు. మోదీతో దేశానికి ముప్పు ఉందన్నారు. సీపీఎం నాయకులు తీన్మార్ మల్లన్న గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోకు కనకరెడ్డి, మునిగెల రమేష్, రాపర్తి రాజు, సాంబరాజు, యాదగిరి, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, ఎమ్డీ షబానా, బూడిద గోపి, జోగు ప్రకాశ్, విజేందర్, నరేందర్, సోమన్న , ఉపేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బంగారు పతకాలు

సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా అందజేత



బంగారు పతకం అందుకుంటున్న దాంశెట్టి శ్రావ్య, అంచూరి కమల

జఫర్‌గఢ్, మే 21: భగవద్గీత శ్లోకాల పఠనం పోటీల్లో విజేతలైన జఫర్‌గఢ్ మండల కేంద్రానికి చెందిన అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్య మంగళవారం మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. దత్తపీఠం ఆధ్వర్యంలో ఇటీవల భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని శ్లోకాల పఠన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న జఫర్‌గఢ్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం మహిళా ప్రతినిధులు అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్య విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించారు. మంగళవారం మైసూరులో దత్తపీఠం ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో వీరికి గణపతి సచ్చిదానంద స్వామి బంగారు పతకాలను అందించి. అభినందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ పవిత్ర గ్రంథమైన భగవద్గీతలోని శ్రీకృష్ణుడి బోధనలకు సంబంధించిన శ్లోకాల పోటీల్లో విజేతలుగా నిలిచి స్వామి వారి చేతుల మీదుగా పతకాలు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాగా, విజేతలను స్థానిక ఆర్యవైశ్య మహిళలు, సంఘం ప్రతినిధులు అభినందించి సత్కరించారు.